ప్రజాశక్తి

ముఖ్యమంత్రి పర్యటన ఖరారు

ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఖరారైంది. ఈ మేరకు అధికారిక ప్రకటనతోపాటు, షెడ్యుల్‌ను సమాచార శాఖ విడుదల చేసింది. ఈనెల 17వ తేదినే నార్పలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఖరారు అయ్యింది. అప్పట్లో అధికారులు ఏర్పాట్లు అన్నీ పూర్తి చేసిన సమయంలో అనివార్య కారణాలతో పర్యటన రద్దయింది. దీంతో వైసిపి నాయకులు, అభిమానుల్లోనూ నిరాశనే మిగిలింది. అయితే తాజాగా మరోమారు ఆయన పర్యటన ఖరారవడంతో అధికారులు ఏర్పాట్లను యథావిధిగా చేపడుతున్నారు. నార్పల క్రాస్ వద్ద సభా వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ముఖ్యమంత్రి పర్యటన సమన్వయ కర్త తలశీల రఘురాంలు సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. నార్పలలోని జూనియర్ కళాశాల మైదానంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి వేదిక వద్దకు వచ్చి వసతి దీవెన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించనున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా...

ఈనెల 26వ తేదీన ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి ముఖ్యమంత్రి అనంతపురం జిల్లా పర్యటనకు విచ్చేయనున్నారు. 8.50 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి తొమ్మిది గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి 9.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. పుట్టపర్తి విమానాశ్రయం నుంచి ఉదయం 10 గంటలకు హెలిక్యాప్టర్‌లో బయలుదేరి 10.20 గంటలకు నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. అక్కడ జిల్లా ప్రముఖులు, ప్రజాప్రతినిధులతో ముఖాముఖి అవుతారు. 10.40 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి నార్పల క్రాస్ వద్దకు చేరుకుంటారు. ఫొటో గ్యాలరీని తిలకిస్తారు. ఉదయం 11 గంటలకు వేదికపైకి వస్తారు. ప్రజాప్రతినిధుల ప్రసంగాలు, లబ్ధిదారులతో ముఖాముఖి అనంతరం ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. వసతిదీవెన చెక్కుల పంపిణీ అనంతరం 12.30 గంటలకు కార్యక్రమం ముగుస్తుంది. కార్యక్రమం అనంతరం 12.45 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. జిల్లా నేతల వీడ్కోలు అనంతరం హెలిక్యాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.30 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటారు. అనంతరం 1.45 గంటలకు విమానంలో తిరుగు ప్రయాణమై 2.45 గంటలకు గన్నవరం చేరుకుంటారు.

భారీగా జనసమీకరణకు ఏర్పాటు

చాలా కాలం తరువాత జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన సాగుతున్న తరుణంలో పెద్దఎత్తున ఏర్పాట్లను జిల్లా అధికార యంత్రాంగంచ చేపడుతోంది. సుమారు పది వేల మంది వరకు విద్యార్థులను ఈ కార్యక్రమానికి హాజరు పరిచే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వీరితోపాటు మరో 20 వేల మందిని సభకు సాధారణ జనాన్ని తీసుకొచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముందు నిర్ణయించిన ప్రకారం 250 ఆర్టీసీ బస్సులను ఇందుకోసం ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం. వేసవి కాలం కావడంతో జనాలు ఇబ్బంది కలుగకుండా ఉండే విధంగా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం వైద్యులను సైతం ప్రత్యేకంగా నియమించారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

నార్పల: ఈ నెల 26వ తేదీన నార్పలో చేపట్టనున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ ఎమ్.గౌతమి ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకూ నడుచుకుంటూ వెళ్లి ప్రతి అంగుళం తనిఖీ చేశారు. హెలీప్యాడ్ నుంచి సభా వేదిక వరకూ దాదాపు రెండు కిలోమీటర్ల దూరం సీఎం కాన్వాయ్ ప్రయాణానికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడికక్కడ బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. సభకు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రేపు సాయంత్రానికల్లా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని, ప్రజలంతా సహకరించి సీఎం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఐజీ ఆర్ఎన్.అమ్మిరెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాస రావు, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, ఆర్డీవోలు మధుసూదన్, నిశాంత్ రెడ్డి, జె.రవీంద్ర, ఆర్అండ్‌బి ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, డీపీవో ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

గుట్టుగా గనుల లీజు

- అమిగోస్ సంస్థ కనుసన్నల్లో మైండ్స్ అండ్ జియాలజీ శాఖ
- నలీస్ విధానంతో కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- గందరగోళంగా మారిన భూగర్భ గనుల శాఖ విధివిధానాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రకతి మానవాళికి అంతులేని సంపదలను సమకూర్చి పెట్టింది. అందులో ప్రధానమైనవి అటవి, ఖనిజ సంపద. ఈ రెండు శాఖల అనుసంధానంతో ప్రజలు ప్రభుత్వానికి ఆదాయ వనరు సమకూరుస్తోంది. అటవీ శాఖ పరిధిలోని భూగర్భ గనులు కొన్ని చోట్ల ఉండగా మరికొన్నిచోట్ల మైన్స్ అండ్ జియాలజీ ఆధీనంలో ఉన్నాయి. ఇటీవల కాలంలో భూగర్భ గనుల శాఖ నుంచి ప్రభుత్వానికి ఆదాయం భారీగా సమకూరుతోంది. ఈ నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత అధికార వైసిపి ప్రభుత్వం ఈ శాఖను ప్రయివేటు పరం చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడమే కాక కొత్త విధానానికి తెరలేపింది. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం గనుల శాఖపై ప్రత్యేక దష్టి సారించి ఆ శాఖ పరిధిలోని ఖనిజ సంపద ఇతర మినరల్స్ వంటి వాటిపై అన్ని హక్కులను ప్రయివేటు పరం చేసే విధంగా టెండర్లు పిలిచి అమిగోస్ మినరల్స్ అనే సంస్థకు వాటిని లీజుకు కేటాయించినట్లు సమాచారం.

కదిరిలో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూగర్భ గనుల ఖనిజ సంపద మినరల్స్ వంటి వాటిపై రూ 10.80 కోట్లకు కేటాయించినట్లు సమాచారం. ఉమ్మడి అనంత జిల్లాలో అత్యధిక శాతం సంపద ఎక్కడ ఉందో అక్కడ ఆ సంస్థ తరపున తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి కార్యకలాపాలను కొనసాగిస్తుండడం గమనార్హం. ఎంతో హంగు ఆర్భాటాలతో తనిఖీ కేంద్రాలను జిల్లాలో కొన్ని చోట్ల ఏర్పాటుచేయగా మరికొన్ని ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. భూగర్భగనులు ఖనిజ సంపదలు ఎక్కడ ఉన్నాయో ఆ ప్రాంతాల్లో ప్రాతినిథ్యం వహిస్తున్న ఆయా ప్రజా ప్రతినిధుల కనుసనల్లోనే ఏర్పాటు చేస్తుండడం గమనార్హం.

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కదిరి, పెనుగొండ, రాప్తాడు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, హిందూపురం, తాడిపత్రి, మడకశిర, ధర్మవరం నియోజకవర్గంలో అత్యధికంగా భూగర్భ గనుల వనరులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో కొండగుట్టలు ఇతర భౌగోళిక వనరులపై ఆధారపడి లక్షలాది మంది పేదలు జీవనం సాగిస్తున్నట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. ఇంత పెద్ద ఎత్తున ఎస్సీ, ఎస్టీ బీసీ, వర్గాలకు చెందిన కుటుంబాలు భూగర్భ గనులు ఇతర సంపదను ప్రజలకు అందిస్తున్నాయి. ఇటీవల కాలంలో అధికారం పార్టీ విధించిన ఉత్తర్వులు వారి జీవన విధానానికి శాపంగా మారిందనీ పలువురు మేధావులు, పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్దేశించిన ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దార్, ఆర్డీవో పరిధిలో లీజ్ ఏర్పడిన రాయల్టీ చెల్లించి తమ జీవన విధానాన్ని వత్తిని కొనసాగించేవారు. ప్రస్తుతం అధికార ప్రభుత్వం గనుల శాఖను ప్రయివేటుకు దారాధత్తం చేయడంతో పేద కుటుంబాలు దిక్కుతోచక అల్లాడుతున్నాయి. నూతన పాలసీ విధానం అమలు చేయడంతో అమిగొస్ సంస్థ ఆంక్షలు పెడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తంచేశారు. భూగర్భ గనులు శాఖ ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాలు ఇబ్బడి ముబ్బడిగా దర్శనమిస్తుండగా మరికొన్నిచోట్ల ఎందుకు ఏర్పాటు చేయడం లేదు అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వాస్తవానికి ఒకవైపు నూతన లీనరీస్ పాలసీ వల్ల ప్రభుత్వ ఆదాయం కోట్లలో వస్తుందని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. మిగిలిన అనధికారకంగా వస్తున్న ఆదాయం ఎవరి జోబులోకి వెళ్తున్నది ఆ శాఖ అధికారులకే తెలియాల్సి ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూగర్భ మైన్స్‌అండ్ జియాలజి శాఖ సంబంధించి తనిఖీ కేంద్రాలు ఎక్కడెక్కడ పెట్టారో.? ఎన్ని ఉన్నాయో.? ఎవరి పర్యవేక్షణలో నడుస్తున్నాయి.? అన్నది తెలియకుండా గోప్యత ప్రదర్శించడం వెనుక మతలబు ఏమిటో గనుల శాఖ అధికారులకు తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా కొండగుట్టలో ఖనిజ సంపదను తీసుకెళ్లడానికి సంబంధిత కాంట్రాక్టర్ లీజు విధానంలో కొంత మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించి అనుమతులు పొందుతారు. మరికొంతమంది కాంట్రాక్టర్లు ప్రభుత్వ భవనాలు ఇతర రోడ్లు పనులు అభివద్ధి పనుల చేస్తున్న సమయంలో తాము చేసిన పనులకు సంబంధించి అంతకుముందే టెండర్ వేసేటప్పుడు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి ఎంబుక్ సైతం రికార్డు చేసి అనుమతులు పొందుతుంటారు. వాస్తవానికి ప్రభుత్వ పనులకు నాడు-నేడు రోడ్లు వంటి పనులకు రాయల్టీ లేదు. అందుకు విరుద్ధంగా తప్పనిసరిగా రాయల్టీ చెల్లించే విధంగా అనధికార విధివిధానాలను అమలు చేస్తూ భారీ స్థాయిలో డబ్బులు దండుకుంటున్నట్లు ఆ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతోపాటు రాళ్లను కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్న వారితో కూడా డబ్బులు వసూలు చేస్తూ అనుమతులు తప్పనిసరి చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. భూగర్భ గనుల శాఖ అధికారుల పర్యవేక్షణలో కొనసాల్సిన తనిఖీలు ప్రయివేటు సంస్థతో చేతులు కలిపి వారి వాహనాలులో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రవేటు సంస్థ కేవలం అనంతపురం జిల్లాలో మాత్రమే తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఎక్కడ ఏర్పాటు చేయకపోవడం ఏమిటన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఆర్‌జె.రత్నాకర్

ఏడాది పాటు సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

2025లో శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహిస్తామని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ పేర్కొన్నారు. సత్యసాయి 12వ ఆరాధన ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. హిల్ హ్యూ స్టేడియంలో సత్యసాయి భజన అనంతరం స్టేడియంలో పాల్గొన్న వేలాది మంది భక్తులకు పరిసర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు అన్న ప్రసాదాలతో పాటు మహిళలకు చీరలు, పురుషులకు ధోవతిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ విలేకరులతో మాట్లాడుతూ ఆరాధనోత్సవాలు విజయవంతంగా జరిగాయన్నారు. వేలాది మంది ఈ కార్యరక్రమంలో పాల్గొన్నారని చెప్పారు. ఆరాధన ఉత్సవాలు పుట్టపర్తిలోనే కాక ప్రపంచం నలుమూలలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సత్యసాయి ఆశయాల మేరకు సేవా కార్యక్రమాలను ట్రస్టు కొనసాగిస్తుందన్నారు. 2025లో సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు ఘనంగా నిర్వహిస్తామన్నారు. సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో త్వరలో మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు.

చేతిరాత పోటీల్లో 'వశిష్ట' విద్యార్థినుల ప్రతిభ

ఓబులదేవరచెరువు : ఆల్ ఇండియా గ్రాఫాలాజీ అసోసియేషన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయస్థాయి క్యాలిగ్రఫీ చేతిరాత పోటీల్లో వశిష్ట ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని బి.నాగవేణి(10 తరగతి) సోమవారం విజయవాడలో ఆ జిల్లా కలెక్టర్ నుంచి స్టేట్ ఎక్సలెన్సీ హ్యాండ్ రైటింగ్-2023లో 3వ స్థానంలో నిలిచి అవార్డు అందుకొంది. అలాగే ఎం.సౌమ్యలతా రెడ్డి(7 తరగతి) సౌత్ ఇండియన్ హ్యాండ్ రైటింగ్ వైస్ ఛాంపియన్-2023 సాధించిందని తెలిపారు. వీరికి తోడు 122 మంది విద్యార్థులు ప్రశంసా పత్రాలు అందుకున్నారని కరెస్పాండెడ్ పి.శివశంకర్ రెడ్డి, ప్రిన్సిపల్ ఎం.జయసింహారెడ్డి తెలిపారు. శిక్షణ ఇచ్చిన వి.చిన్న గంగప్ప, జాతీయస్థాయి చేతిరాత క్యాలిగ్రఫీ గ్రాఫిలజిస్ట్ నిపుణులను ప్రత్యేకంగా అభినందించారు.

పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ

రామగిరి : ఎస్సీ కార్పొరేషన్‌ను రద్దు చేసిన వైసీపీకి వచ్చే ఎన్నికలో తగిన గుణపాఠం చెప్పి టిడిపిని గెలిపించాలనే విషయంపై దళితులను చైతన్యవంతం చేయడంలో భాగంగా టిడిపి ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలను సోమవారం మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామ్మూర్తి నాయుడు, సత్యసాయి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బి.రంగయ్య, కన్వీనర్ సుధాకర్, మండల ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, టిడిపి యువత అధ్యక్షుడు ఎల్.శ్రీధర్ నాయుడు, సత్య సాయి జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఎం.సుబ్బరాయుడు, నసనకోట ఎంపిటిసి టి.శ్రీనివాసులు, నసనకోట సర్పంచి లలితమ్మ, దళిత సేన అధ్యక్షుడు ఏపీ ముత్యాలు, రామగిరి మండల దళిత నాయకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ మన ప్రభుత్వం

నల్లచెరువు : మండల పరిధిలోని ఓరువాయి సచివాలయంలోని మారిశెట్టిపల్లి, చెరువువాండ్లపల్లి గ్రామాలలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కదిరి శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన గ్రామంలో గల ప్రతి గడపను సందర్శించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వాటి అమలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.రమణారెడ్డి, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను నిలదీసిన మహిళ

గోరంట్ల : మండలంలోని మల్లాపల్లి పంచాయతీ బుగానిపల్లిలో సోమవారం నిర్వహించన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. తనకు అన్యాయం జరిగిందని న్యాయం చేయాలని అదే గ్రామానికి చెందిన భారతి అనే మహిళ ఎమ్మెల్యే శంకర్నారాయణ ను నిలదీశారు. ఈ సందర్భంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుగానిపల్లిలో నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన భారతి అంగనవాడి కార్యకర్తగా పనిచేస్తోంది. స్థానిక వైసిపి నాయకులు కక్షగట్టి తనపై అసత్య ఆరోపణలు చేసి తన ఉద్యోగాన్ని పోవడానికి కారణమయ్యారని తనకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే శంకరనారాయణను నిలదీశారు. తన ఉద్యోగం పోవడానికి స్థానిక వైసిపి నాయకులు కారణమంటూ ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది సంవత్సరాలుగా అంగన్వాడి కేంద్రాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించానని రాజకీయకక్షతోనే ఉద్యోగం నుండి తొలగించారని వాపోయారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గోరంట్ల : పర్యావరణాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని ఎస్‌కేయూ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ భాస్కర్‌నాయుడు పేర్కొన్నారు. స్థానిక ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపల్ పెద్దరాసు భక్తవత్సలం అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ పిఓలు ఆజాద్, బాలమోహన్ పర్యవేక్షణలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ నాయుడు మాట్లాడుతూ మానవాళికి ప్రకతి గాలి, నీరు, ఆహారం, సూర్యరశ్మి, మొక్కలు అందిస్తుందని, కావున మొక్కలను విరివిగా పెంచి ప్రకతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపైఉందన్నారు. విద్యార్థులను హ్యూమన్ రైట్స్‌లో, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేయటానికి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అరవింద్, కవిత, శివశంకర రెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులపై నిర్లక్ష్యం తగదు : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తిరూరల్

'స్పందన'కు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 51 ఫిర్యాదులు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను విన్నారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి తాము సికే పల్లి పట్టణంలో నివాసం ఉంటున్నామని మా అమ్మ పేరు మీద 60 సెంట్ల భూమి ఉందని దానికి సంబంధించిన అన్ని హక్కు పత్రాలు ఉన్నాయని, అయితే అదే గ్రామానికి చెందిన పి.గోవిందప్ప కుటుంబ సభ్యులు సరిహద్దు రాళ్లను తొలగించి ఈ స్థలం మాదని దౌర్జన్యానికి దిగుతున్నారని ఈ విషయంపై సీకే పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఎస్పీ ముందు మొరపెట్టుకున్నారు. అలాగే మడకశిర బార్ అసోసియేషన్ సభ్యురాలు, జూనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్న తనను ఆర్.అనంతపురానికి చెందిన (వరసకు మేనమామ) తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేసి నన్ను లైంగికంగా వేధిస్తున్నారని, ఈ విషయంపై మడకశిర పోలీసులకు విన్నవించినా ఫలితం లేదని ఎస్పీ ముందు కంటతడి పెట్టింది. వీటికి తోడు రస్తా వివాదాలు, కుటుంబ కలహాలు, అదనపు కట్నం కోసం భర్త, అత్తారింటి వేధింపులు, ఉద్యోగ, ఆర్థిక మోసాలు, భూ వివాదాలు, సైబర్ నేరాలు, తదితర సమస్యలను ఎస్పీకి విన్నవించారు. పోలీసు పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, స్పందన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఎస్పీ సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కేవి రామకష్ణ ప్రసాద్, ఎస్‌బి డీఎస్పీ ఉమా మహేశ్వర రెడ్డి, ఎస్‌బి సీఐ రవీందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిది పైశాచిక ఆనందం : ఎమ్మెల్యే

విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి -పెనుకొండ

టిడిపి వాళ్లది పైశాచిక ఆనందమని వైసిపి జిల్లా అధ్యక్షులు పెనుకొండ ఎమ్మెల్యే మాలకొండ శంకర్ నారాయణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ను చూసి టిడిపికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు సెల్ఫీ ఛాలెంజ్ లు చేస్తున్నారని తెలిపారు. పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బి.కే. పార్థసారథి కియా వద్ద సెల్ఫీ తీసుకోవడం జరిగిందని అయితే కియా పరిశ్రమ తీసుకువచ్చినది నరేంద్ర మోడీ అని అది ఇంటర్నేషనల్ కంపెనీ అని ఆ కంపెనీ ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ప్రధానంగా ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ కు సమీపంలో ఎక్స్‌ప్రెస్ అనుకూలంగా జాతీయ రహదారి రైల్వే లైన్ ఉండడంతో పెనుకొండకు కియా పరిశ్రమ వచ్చిందని అన్నారు. చంద్రబాబును చూసి కియా పరిశ్రమ ఇక్కడ కు రాలేదన్నారు. ఎకరా భూమిని చదును చేయడానికి ఖర్చు చేసిన రూ 30 లక్షలలో చంద్రబాబుకు లోకేష్ కు బి.కె పార్థసారథికి వచ్చిన వాటా ఎంతో చెప్పాలని ప్రశ్నించారు. టిడిపి నాయకురాలు సవితమ్మ గొల్లపల్లి రిజర్వాయర్ వద్దకు వెళ్లి సెల్ఫీ తీసుకొందని గొల్లపల్లి రిజర్వాయర్ ను ప్రారంభించింది వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని చెప్పారు. రూ. 5400 కోట్ల రూపాయల నిధులు హంద్రీనీవా కోసం ఖర్చు చేశారని తెలిపారు. అయితే చంద్రబాబు నాయుడు 9 ఏళ్లలో రూ. 9 కోట్లు ఖర్చు చేసి సాగునీటి ప్రాజెక్టును తాగునీటి ప్రాజెక్టుగా మార్చారన్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు పరిటాల సునీతమ్మ, కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథ్ రెడ్డి సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్నారని వారు గ ఐదేళ్లలో వారి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి గురించి శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాము ఈ నాలుగేళ్లలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి గురించి శ్వేత పత్రం విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నాగలూరు బాబు, టౌన్ కన్వీనర్ నరసింహ, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు కష్ణారెడ్డి,నగర పంచాయతీ చైర్ పర్సన్ ఫరూక్, వైస్ చైర్ పర్సన్ సునీల్, శ్రీకాంత్ రెడ్డి, వెంకటరామి రెడ్డి,సోమందేపల్లి ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం,మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు గోపాల్ రెడ్డి, కొండలరాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువత సామాజిక సేవ అలవర్చుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకుడు

ప్రజాశక్తి-మడకశిర

సామాజిక సేవలో ప్రధానంగా యువత పునరంకితం కావాలని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బూతన్న పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఆర్.అనంతపురం గ్రామం మండల ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో సోమవారం వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సామాజిక సేవా దృకృథంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూతన్న మాట్లాడుతూ నేటి యువతే భావిభారత భవిష్యత్తు సారథులని కొనియాడారు. ముఖ్యంగా సాంఘిక రుగ్మతలైన కులవివక్ష, అంటరానితనం, నిరక్షరాస్యత, బాలిక విద్య పట్ల చిన్నచూపు, తదితర వాటిని రూపు మాపడంలో భాగంగా గ్రామీణుల్లో అవగాహన కల్పించడంతో పాటు చైతన్యం తీసుకు రావాలని పిలుపునిచ్చారు. వాటితో పాటు పచ్చదనం-పరిశుభ్రత, ఎయిడ్స్‌పై అవగాహన, వ్యవసాయ-పాడి పరిశ్రమ పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల ఈ వారం రోజుల్లో గ్రామంలో అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ వంటి ప్రక్రియల ద్వారా స్ఫూర్తి, చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మురళీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు , సర్పంచి శివ గంగప్ప, అధ్యాపక బందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో అందే ప్రజా సమస్యలపై దష్టి సారించాలని తహసీల్దార్ యుగేశ్వరిదేవి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించగా 8 అర్జీలు అందినట్లు తెలిపారు. వాటిలో భూ సమస్యలపై 6, రస్తా సమస్యపై 2 అందాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి. ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్, ఇంజినీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఏఓ ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్ కో ఏఈ శివయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఉత్తమ గ్రామపంచాయతీలకు ప్రశంసా పత్రాలు

గోరంట్లలో సర్పంచులను సన్మానిస్తున్న దృశ్యం

ఒడిసిలో ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు

గోరంట్ల: మండలంలో సుపరిపాలన అందించిన గ్రామపంచాయతీలకు చెందిన సర్పంచులకు గ్రామ కార్యదర్శులకు ఎంపీపీ ప్రమీల మూర్తి ఎంపీడీవో రఘునాథ్ గుప్తా ప్రశంస పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అందజేశారు, ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని సర్పంచులు కార్యదర్శులు ఘనంగా నిర్వహించారు పాలసముద్రం, వానవోలు, మల సముద్రం, నర్సంపల్లి, గోరంట్ల, మండలపల్లి, మల్లాపల్లి గ్రామపంచాయతీలో తాగునీరు పరిసరాలు పరిశుభ్రత మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం వంటి విషయాలలో సుపరిపాలన జరిగిందని సర్వేలో వెల్లడైందన్నారు. దీంతో ఆయా గ్రామపంచాయతీలకు జిల్లా ఉన్నతాధికారి నుండి ప్రశంస పత్రాలు వచ్చాయనిఎంపీడీవో రఘునాథ్ గుప్తా తెలిపారు రాబోవు రోజుల్లో కూడా గ్రామాల్లో సుపరిపాలన అందించడానికి సర్పంచులు కార్యదర్శులు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జయరామ్ నాయక్, జిల్లా కోఆప్షన్ మెంబర్ బాషా, ఇన్చార్జి ఇఒఆర్డి సతీష్, సర్పంచులు గంగప్ప, సరోజ నాగే నాయక్, శివానంద, రామాంజనేయులు, నర్సిరెడ్డి, కార్యదర్శులు నాగరాజు, సోమశేఖర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: మండలం వ్యాప్తంగా పంచాయతీ కేంద్రాల్లో పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకలను సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా నిర్వహించుకున్నారు. పెడపల్లి గ్రామపంచాయతీ లోగల సచివాలయంలో సర్పంచి మంగ్లీ బాయ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకలు నిర్వహించి గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పంచాయతీని అభివృద్ధి పరచుకునేందుకు కొన్ని మార్గాలను సూచిస్తూ సచివాలయ సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని ప్రజలందరికీ త్వరితగతిన సేవలను అందించడం వలన మేలు కలుగుతుందని అన్నారు. అనంతరం గ్రామపంచాయతీ అభివృద్ధి కొరకు ప్రణాళికను తయారుచేసి వాటిని తప్పకుండా అమలు చేస్తామని వాటి ద్వారా మన పంచాయతీ అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచి సీనప్ప ఎస్టీ సెల్ తిరుపాల్ నాయక్ , శ్రీనివాస నాయక్, బండ్ల మోహన , కార్యదర్శులు తేజశ్రీ, నరేష్, ఎంపిటిసి సరస్వతి బాయ్, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల కేంద్రం లోని ఎంపీడీఒ కార్యాలయం, లేపాక్షి పంచాయతీ కార్యాలయం లో పంచాయతీ రాజ్ శాఖ దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆదినారాయణ, నాగేంద్ర, వసుంధర కార్యదర్శులు నాగేంద్ర, ఆనంద్ కుమార్, లక్ష్మయ్య, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు

గాండ్లపెంట : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. సుపరిపాలన అందించిన పంచాయతీలకు ప్రశంసాపత్రాలను ఎంపీపీ తాతం జగన్మోహన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్డి సునీత, సీనియర్ సహాయకులు ఎన్. అమీర్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు బాషా, ఓబులమ్మ, సర్పంచులు రహంతుల్లా రవీంద్ర నాయక్ సర్పంచులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండల వ్యాప్తంగా ఉన్న 14 పంచాయతీల్లో తొమ్మిది పంచాయతీలు అభివృద్ధిలో ముందడుగు వేస్తూ జిల్లా స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని ఎంపీడీవో సరస్వతి అన్నారు. పంచాయతీ రాజ్ దినోత్సవంలో భాగంగా ప్రభుత్వం గుర్తించిన తొమ్మిది ప్రణాళికలతో సుపరిపాలన అందించిన గ్రామ పంచాయతీలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్డి చంద్రశేఖర్, ఎంఇఒ లక్ష్మీదేవి, వ్యవసాయ అధికారిణి విజయభారతి, హౌసింగ్ అధికారి సునీత తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : మండల పరిధిలోని చందకచర్ల పంచాయతీ సుపరిపాలన అందించిన దానికి గుర్తింపుగా ప్రభుత్వం అవార్డు అందజేసింది. సర్పంచి ప్రభావతి దేవల నాయక్ ఆధ్వర్యంలో పంచాయతీని అభివృద్ధి చేసినందుకు .సోమవారం స్థానికఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సోనీ బాయ్,ఎంపీపీ కవితా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : గ్రామాల అభివృద్ధిలో పంచాయతీరాజ్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని సుపరిపాలన కోసం పంచాయతీ రాజ్ వ్యవస్థ పనిచేస్తోందని ఎంపీడీవో పోలప్ప పేర్కొన్నారు స్థానికమండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పర్వీన్ భాను, ట్రాన్స్‌కో ఎఇ రామసూరారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ దీపక్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగిరెడ్డిగారిజయమ్మ, ఏపీవో సోమశేఖర్, ఎపిఎం రమణప్ప, సర్పంచులు గోవిందు, రేణుక భాయ్, పంచాయతీకార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండల పరిధిలోని అప్పరాచెరువు ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడంతో సోమవారం పుట్టపర్తిలో జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమంలో సర్పంచి శారదమ్మ, కార్యదర్శి అలివేలుమంగమ్మలకు కలెక్టర్ విజయ్‌బాబు అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. 'దారిద్ర్య నిర్మూలన జీవనోపాధి' అంశంలో అప్పరాచెరువు పంచాయతీకి అవార్డు లభించింది.

నంబులపూలకుంట

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ ఈటె రాము అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ పంచాయతీల్లోని సర్పంచిలు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పాలన సాగిస్తున్నారన్నారు. అనంతరం పలువురు సర్పంచిలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆదినారాయణ, ఈఓఆర్డీ మనోహర్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచిలు, ఉపసర్పంచిలు పాల్గొన్నారు.

కొత్తచెరువు: పంచాయతీల అభివృద్ధికి సర్పంచిలు, కార్యదర్శులు కషి చేయాలని ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, ఎంపీడీవో సిద్ధారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం గురించి తెలుసుకొని వాటికి అనువుగా గ్రామాల్లో పాలన నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చే నిధులను పంచాయతీల్లో పారిశుద్ధ్యం, అభివద్ధి పనులకు ఉపయోగించాలన్నారు. ముఖ్యంగా వీధిలైట్లు, తాగునీరు, డ్రైనేజీ, తదితర మౌలిక సౌకర్యాలపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామీ పనులను గ్రామాల్లోని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ పంచాయతీలుగా ఎన్నికైన కొడపగానిపల్లి, తిరుమల దేవరపల్లి, నాగిరెడ్డిపల్లి పంచాయతీలకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నాగిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఓబులేసు, కార్యదర్శులు గంగాధర్ రెడ్డి, సాయినాథ్, సూపర్‌వైజర్ పుష్పలత, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు,

బత్తలపల్లి : స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి గజ్జల వెంగళరెడ్డి మాట్లాడుతూ మండలంలో ప్రతి పంచాయతీ ఆదర్శ పంచాయతీగా అభివద్ధి చెందాలన్నారు. సర్పంచిలు, కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన అప్పరాచెరువు, సంగాల, మాల్యవంతం, దంపెట్ల, బత్తలపల్లి, ఓబుళాపురం, సంజీవపురం, తంబాపురం, పోట్లమర్రి, ఈదుల ముత్తూరు, గరిశనపల్లి, నల్లబోయనపల్లి, డి. చెర్లోపల్లి, పంచాయతీలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అంతకుముందు మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యుగేశ్వరీదేవి, ఎంపిడిఓ శ్రీదేవి, కార్యదర్శులు, సర్పంచిలు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

బుక్కపట్నం: బుక్కపట్నం గ్రామ పంచాయతీ ఉత్తమ పంచాయతీగా ఎన్నికైనందున సోమవారం సర్పంచ్ నాగలక్ష్మి రాజుకు ప్రశంసా పత్రం అందజేశారు. పంచాయతీ పరిధిలో స్వయం సమద్ధి, మౌలిక సదుపాయాలు, నీటి సమద్ధి కలిగిన పంచాయతీ విభాగంలోనూ, సుపరిపాలన కలిగిన పంచాయతీ వంటి అంశాల్లో మండల స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎన్నిక కావడంతో ఈ పురస్కారాలకు అర్హత పొందింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తాము చేసిన సేవలకు గుర్తింపుగా పురస్కారాలు రావడం ఆనందదాయకమన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి ఎంపీడీవో శ్రీనివాసులు, జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్ రెడ్డి, ఈవోఆర్‌డి ఇందిరాబాల, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు..

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

ధర్మవరం టౌన్ : మండల పరిధిలోని గరుడంపల్లి వంక మలుపు వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం చెందాడు. బంధువులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. ధర్మవరం పట్టణంలోని యాదవ వీధికి చెందిన సుబ్బమ్మ, వెంకటశివ దంపతుల కుమారుడు ఆదిశేషు(28) బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటూ విధులు(వర్క్ ఫ్రం హోం) నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదిశేషు స్నేహితులు ఎ.రవితేజ, మంజులతో కలిసి ఆదివారం కారులో శ్రీశైలం బయలుదేరారు. అయితే గరుడంపల్లి వంక మలుపు వద్దకు రాగానే కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆదిశేషు అక్కడికక్కడే మతిచెందగా రవితేజ, మంజు తీవ్రంగా గాయపడగా అనంతపురంలోని సవేరా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చేతికొచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు విలపించిన తీరు పలువురిని కలచి వేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు

గుండెపోటుతో రెవెన్యూ ఉద్యోగి మృతి

నల్లచెరువు : మండల తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న గురుదత్తప్రసాద్ సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. గురుదత్తప్రసాద్ స్వంత ప్రాంతం రామగిరి మండలం అయినప్పటికీ తనకల్లు మండలంలోని ముళ్ళోళ్ళపల్లిలో నివాసమున్నాడు. తనకల్లు,నల్లచెరువు మండలాలలో వీఆర్వో, ఆర్ఐగా విధులు నిర్వహించిన ఆయన అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది నల్లచెరువు తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. గురుదత్తప్రసాద్ మృతికి తోటి ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గ్యాస్ వినియోగదారులకు మోసం

సోమందేపల్లి : మండలంలోన గ్యాస్ వినియోగదారులకు ఓడీసీకి చెందిన శ్రీ దుర్గా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తక్కువ తూకం, అధిక ధరలు వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని వినాయక నగర్ లో నివాసముంటున్న గిరిజన వృద్ధులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఈనెల ఏడవ తేదీన ఒక గ్యాస్ బండను తీసుకున్నామని చెప్పారు. తమ కుటుంబంలో కేవలం ఇద్దరు వృద్ధులు మాత్రమే ఉన్నామని ఆ తీసుకున్న గ్యాస్ బండలో 15 రోజులలోపే గ్యాస్ అయిపోయిందని వాపోయారు. ఈ విషయాన్ని సోమవారం గ్యాస్ నిర్వహకులకు తెలిపామని వారు తమకు సంబంధం లేదని చెబుతున్నారన్నారు. మీకిష్టం వచ్చింది చేసుకోండని నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈ గ్యాస్ నిర్వహకులు ఒక గ్యాస్ బండ పైన అధిక రుసుము వసూలు చేస్తున్నారని పలువురు గ్యాస్ వినియోగదారులు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న గ్యాస్ వినియోగదారులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పంచాయతీలో అక్రమాలపై చర్యలేవీ..?

కొత్తచెరువు : కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీలో బయట పడుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి డి ఆంజనేయులు, నాయకులు గౌస్ విమర్శించారు. ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ సొమ్మును పంచాయతీ ఖాతాకు జమ చేయకుండా వారి సొంత అవసరాలకు ఉపయోగించుకున్నారన్నారు. ఈ అక్రమాలపై గతంలో కూడా పెనుగొండ డిఎల్‌పిఒ రికార్డులను తనిఖీ చేసి అవినీతి జరిగిందని తేలిన కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.కోట్ల రూపాయలల్లో పంచాయతీకి ఆదాయం ఉన్నా ఎలాంటి అభివృద్ధి పనులు నిర్వహించలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించ అవినీతిపైన విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంయుక్త జిల్లా కార్యదర్శి జయలక్ష్మి, సిపిఐ మండల నాయకులు వెంకటనారాయణ, రమణమ్మ, ఈశ్వరమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రులకు అప్పులు.. అదానీకి ఆస్తులు ..

కదిరి టౌన్ : పేదల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్న మోడీని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. వేమయ్య యాదవ్ అన్నారు. సీపీఎం సీపీఐ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం కుటాగుళ్ల,31,32 వార్డులలో ఇంటింటికి వెళ్లి మోదీ అవలంబిస్తున్న మోసపూరిత విధానాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. మోడీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. అప్పులు ఆంధ్రులకు ఆస్తులు అంబానీలకు కట్ట పెట్టి సంపన్న వర్గాలకు కొమ్ము కాస్తూ ప్రజా సమస్యలను మోడీ గాలికి వదిలేసారని విమర్శించారు. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ లౌకిక వాద పరిరక్షణకు తూట్లు పొడుస్తూ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న మోడీ పాలన పై ప్రజలు విసుగెత్తి పోయారన్నారు. పేదల పక్షాన పోరాడేది వామపక్షాలు మాత్రమే నన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపికి తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కదిరప్ప, లియాకత్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మధు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి

కదిరిటౌన్: అర్హత కలిగిన ప్రతి విలేకరికి అక్రిడిటేషన్ మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ అండ్ రిపోర్టర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు ఆ యూనియన్ అధ్వర్యంలో సోమవారం సత్య సాయి జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో జిల్లా కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, శంకర, కుళ్లాయప్ప, సాయిప్రసాద్, రవికుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

గోరంట్ల: మండలంలో 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో రఘునాథ్ గుప్త, ఎపిఒ వరప్రసాద్ తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 ఎకరాలు లోపు ఉన్న రైతుల నుంచి పండ్ల తోటల పెంపకానికి ఉపాధి హామీ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మడకశిర : మండల పరిధిలోని వైబి హళ్లి గ్రామానికి చెందిన లక్ష్మీనరసమ్మ వర్ధంతి పురస్కరించుకొని ఆమె కుమారులు వై.ఎన్.రవి శేఖర రెడ్డి, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఆముదాలగొంది గ్రామంలోని వెంకటేశ్వర వద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకుడు తిమ్మారెడ్డి పాల్గొన్నారు .

ఆలయ అభివృద్ధికి విరాళం

లేపాక్షి: మండల పరిధిలోని పులమితి గ్రామంలో సత్యమ్మ ఆలయానికి సోమవారం దాతలు రూ. 9 వేలు విరాళంగా అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ సూచన మేరకు టిడిపి కన్వీనర్ ఈ.జయప్ప రూ. 5వేలు, సడ్లపల్లి అశ్వత్థప్ప రూ.2వేలు, పులమతి బాబావలి రూ.2వేలు అందజేసి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా జయప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని, భక్తి భావంతో ముందుకెళ్తే అభివద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

శ్మశాన వాటికకోసం భూమి కేటాయించండి

మడకశిర రూరల్ : దళితులకు శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తాసిల్దార్ బాల ఆంజనేయులుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు అందించారు, ఈసందర్భంగా నాయకుడు అంజనప్ప మాట్లాడుతూ మెలవవాయి, జమ్మనపల్లి, ఆమదాలగొంది ఇలా పలు గ్రామాల్లో దళితులకు శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు, దళితులు అంతక్రియలు చేయాలంటే ముళ్ల పొదల్లో వంకలు వాగుల్లో మృతదేహాన్ని ఖననం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉన్నత అధికారులు స్పందించి కనీసం దళితులకు శ్మశాన వాటికోసం రెండు ఎకరాల భూమి ఇవ్వాలని అంతక్రియలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు అంజనప్ప, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, తాలూకా ఇంచార్జ్ గౌడనహల్లి అంజి, ఎమ్మార్పీఎస్ నాయకులు శివప్ప, రామాంజనేయులు, నరేష్, పాల్గొన్నారు.

అడుగడుగునా అన్నప్రసాదాలు

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్య సాయి బాబా ఆరాధన వేడుకలు సందర్భంగా పుట్టపర్తి లోనూ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద సత్యసాయి భక్తులకు అడుగడుగునా అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రీ సత్య సాయి బాబా శివైక్యమై 12 సంవత్సరాలైన సందర్భంగా పట్టణంలోని బిల్డర్లు, కాంట్రాక్టర్లు, సత్య సాయి సేవకులు ఎంతో ఎంతోమంది సేవ భావంతో ముందుకు వచ్చి ఆరాధనోత్సవాలకు వచ్చిన భక్తులకు మజ్జిగ, చల్లని పానీయాలు, అన్న ప్రసాదాలు అందజేశారు. గణేష్ సర్కిల్ నుండి సత్యమ్మ గుడి వద్ద వరకు రోడ్డుకు ఇరువైపులా సెమియానాల వేసి, వచ్చిన భక్తులకు పులిహోరా, కేసరీబాత్, స్వీట్ పొంగల్, చిత్రాన్నం, నిమ్మరసం, మజ్జిగ అందజేశారు. శ్రీ సత్య సాయి బాబా ఆరాధనోత్సవాలు గత నాలుగు సంవత్సరాల ,నుండి జరగకపోవడంతో ఈ ఏడు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యసాయి భక్తుడు సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ సత్యసాయిబాబాని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ సేవా ప్రేమతత్వం అలవర్చుకోవాలన్నారు.

బకాయి పన్నులు చెల్లించండి

కొత్తచెరువు : గ్రంథాలయానికి గ్రామ పంచాయతీ నుంచి రావలసిన బకాయి పన్నులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సిద్ధారెడ్డిని గ్రంథాలయ అధికారి జయరాం కోరారు. ఈ మేరకు ఆయన వినతిపత్రం సమరఇపంచారు. మండలంలోని 15 పంచాయతీలలో గ్రంథాలయ సంస్థకు దాదాపుగా ఐదు లక్షల రూపాయలకు పైబడి బకాయి ఉందన్నారు. త్వరగా వాటిని చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రంథాలయాలకు చెల్లించాల్సిన బకాయిలను పంచాయతీలు మున్సిపాలిటీలు చెల్లిస్తున్నాయని, కొత్తచెరువు మండలంలోని పంచాయతీలు బకాయిలు చెల్లించలేదని చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని ఆయన ఎంపీడీవోను కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

లేపాక్షి : క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని పలువురు అతిథులు అన్నారు. స్థానిక వివేకానంద జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణం లో సోమవారం టోర్నమెంట్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిల్లో క్రీడలతోనే యువత భవిష్యత్తులు బాటలు పడతాయని అన్నారు. వైసిపి సచివాలయ కన్వీనర్ నిస్సార్ అహమ్మద్ సౌజన్యంతో ప్రారంభమైన వైఎస్సార్ టోర్నమెంట్ సోమవారం సాయంత్రం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలోవైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణ స్వామి, వైస్ ఎంపిపి అంజిరెడ్డి ఎంపిటిసి సభ్యుడు ఆదినారాయణ, గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, నాయకులు గోపాలప్ప, అంజినరెడ్డి, చలపతి, ప్రసాద్, శంకరప్ప, శంకరరెడ్డి, జగన్, ఇర్ఫాన్, అన్సర్, ఖయ్యూం, ఆఫీజ్, లక్ష్మీనారాయణరెడ్డి, అంపియర్ తందీర్, ముజంమీర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై సకాలంలో స్పందించండి

హిందూపురం : వేసవిలో పురపాలక సంఘ వ్యాప్తంగా ఎక్కడా నీటి సమస్య వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ఫిట్టర్‌లకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ఆదేశించారు. సోమవారం నీటి సమస్యపై ఫిట్టర్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘంలో బోరు బావులు ఎన్ని ఉన్నాయి, అందులో ఎన్ని పని చేస్తున్నాయి, పైప్ లైన్ అన్ని ప్రాంతాల్లో ఉంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమె మాట్లాడుతు పురపాలక సంఘ వ్యాప్తంగా అన్ని బోరు బావులు వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. వెంటనే నీటి సమస్య అధిగమించడానికి అవసరమైన చర్యలను తీసుకోవాలన్నారు.

పేదల కడుపు నింపడమే టీడీపీ లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరంటౌన్

పేదల కడుపు నింపపడమే టీడీపీ లక్ష్యమనిఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వఇ అవినీతి పాలన సాగిస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఓ చేతికి రూ. 10 ఇచ్చి రెండో చేతి ద్వారా రూ. 100 వసూలు చేస్తోందన్నారు. అన్నా క్యాంటీన్లు ఎత్తేసి పేదల కడుపు కొట్టిందని మండిపడ్డారు. ప్రజల కోసం వేల కోట్లు ఖర్చుపెడుతున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ పేదల ఆకలి తీర్చడంలో ఏడాదికి రూ.300 కోట్లు ఖర్చుపెట్టలేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురుషోత్తంగౌడ్, బీరే శ్రీనివాసులు, హోటల్ మారుతి, ఉస్మాన్, అడ్డా మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి సబ్‌ఎడిటర్ రమేష్‌కు వీడ్కోలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సబ్ ఎడిటర్ రమేష్‌బాబును సన్మానిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

ప్రజాశక్తి దినపత్రిలో సబ్‌ఎడిటర్‌గా పని చేసిన ఆకుల రమేష్ బాబును సాహితీ సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం నాడు బళ్లారి రోడ్డులోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో డెస్క్ఇన్‌ఛార్జి టి.శివప్రకాశ్ ఆధ్వర్యంలో అభినందన, వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణు గోపాల్, స్టాఫ్ రిపోర్టర్ షఫీవుల్లా, జిల్లా ఇన్‌ఛార్జి మురళి హాజరయ్యారు. డీఎస్సీ-98కు ఎంపికైన రమేష్‌ను శాలువాలు, పుష్పగుచ్ఛాలు జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి - లేపాక్షి

మండలం పరిధిలోని సత్యసాయి భజనమందిరం ల ఆధ్వర్యంలో సత్య సాయి ఆరాధనోత్సవాలలో భాగంగా సోమవారం నిరుపేదలకు అన్నదానం కార్యక్రమాన్ని లేపాక్షి,కంచిసముద్రం, మల్లిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించారు. అదేవిధంగా మంగళవారం నాడు స్థానిక ప్రభుత్వం ఆసుపత్రి నందు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి భజనమందిరం సభ్యులు రామకృష్ణ బట్, బేబీయమ్మ, కంచిసముద్రం కమిటీ సభ్యులు, మల్లిరెడ్డిపల్లి భజనమందిరం సభ్యులు పాల్గొన్నారు

ఘనంగా సత్యసాయి ఆరాధన

ప్రజాశక్తి-కొత్తచెరువు

సత్యసాయి బాబా 12వ ఆరాధన మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక సత్యసాయి భజన మందిరంలో అన్నదానం చేశారు. అలాగే స్థానిక పుట్టపర్తి రోడ్డులోని హోటల్ అంజి అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ సత్యసాయి సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. సత్యసాయి సేవలు ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బాబా భక్తులు పాల్గొన్నారు

గ్రౌండింగ్ మేళాలో పాల్గొనండి

ధర్మవరం టౌన్ : గృహ లబ్ధిదారులు గ్రౌండింగ్ మేళాలో పాల్గొని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు.పట్టణంలోని పోతుల నాగేపల్లి లేఅవుట్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్న గ్రౌండింగ్ మేళాలో పెండింగ్‌లో ఉన్న గృహ లబ్ధిదారులందరూ పాల్గొనాలన్నారు. ఇంటి నిర్మాణం చేపట్టడంలో సచివాలయ కార్యదర్శులు, హౌసింగ్, మున్సిపల్ సిబ్బంది లబ్ధిదారులకు సహాయ సహకారాలు అందిస్తారన్నారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం చేస్తే సర్వే జరిపి, ఆ ఇంటి పట్టాను రద్దు చేసి అర్హులకు ఆ ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు.

రీ సర్వే, భూ పంపిణీపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలో జరుగుతున్న రీ సర్వే, భూ పంపిణీ కార్యక్రమంపై ప్రత్యేక దష్టి సారించాలని తపశీల్దార్ యుగేశ్వరిదేవి వీఆర్‌ఓలకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె వీఆరోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వారి సందేహాలను నివత్తి చేయాలన్నారు. అందరూ రీ సర్వే చేసుకుంటే జరిగే లాభాల గురించి వివరించాలని ఆదేశించారు. అలాగే భూ పంపిణీకి అర్హులను ఎంపిక చేయాలన్నారు. తొలి జాబితాలో అనర్హులుంటే తొలగించాలన్నారు. విమర్శలకు తావు లేకుండా జాబితా తయారు చేయాలన్నారు. డి.చెర్లోపల్లి రెవెన్యూ గ్రామల్లో అవకతవకలు లేకుండా అర్హులకు మాత్రమే పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. తప్పుడు కథనాలు రాయవద్దని సూచించారు. బోగస్ పాసు పుస్తకాలు కలిగిన రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు హరిప్రసాద్, సునీత, వీఆర్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి- హిందూపురం

సచివాలయాల పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ సచివాలయ సెక్రటరీలకు ఆదేశించారు. సోమవారం పురపాలక సంఘ పరిధిలోని ముదిరెడ్డిపల్లిలో ఉన్నా 36, 37 సచివాలయాలను ఆమె ఆకస్మిక తనఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సెక్రెటరీల హాజరు పట్టికను తనఖీ చేసి, ఎంత మంది హాజరయ్యారో రోజు ఎంత మంది ఏఏ సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నారో చెప్పు అనే పరిస్థితి దాపురించిందని అన్నారు. తనఖీల్లో ఈమె వెంట యువజన విభాగం జిల్లా అధ్యక్షులు వాల్మికి లోకేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

కదిరిలో కుండపోత వర్షం

ప్రజాశక్తి - కదిరి టౌన్

భానుడి భగభగలు ఎండ వేడిమి ఉక్కపోతతో రెండు నెలలపాటు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో సోమవారం రాత్రి కదిరి పట్టణంలో 8 గంటల నుండి వర్షం ప్రారంభమై దాదాపు గంటకు పైగా ఉరువులు మెరుపులతో కూడిన భారీ వర్షం ఏకధాటిగా కురిసింది. దీంతో వీధులన్నీ వర్షపు నీటితో జలమయమయ్యాయి. తొలకరి వర్షం పులకరించడంతో ఎండ వేడి వడగలుపుల నుండి కాస్త ఉపశమనం లభించిందని ప్రజలు ఆనంద వ్యక్తం చేశారు

కదిరిలో కుండపోతగా కురుస్తున్న వర్షం

30 నుంచి ధ్వజ స్తంభం ప్రతిష్టాపన కార్యక్రమాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండల పరిధిలోని జ్వాలాపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీ నుంచి ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, కల్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలకు పుణ్యాహవాచనం, రక్షాబంధనం, 1వ తేదీ సాయంత్రం 5 గంటలకు ధ్వజ స్తంభానికి మహాస్నపనము, జలాధివాసం, 2వ తేదీ ఉదయం 7.30 గంటలకు ధ్వజ స్తంభానికి ధాన్యాధి వాసం, జపము, క్షీరతర్పణం, హోమం, తయ్యాది వాసం జరుగును. 3వ తేదీ ఉదయం 7.32 గంటలకు ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, పూర్ణాహుతి, మంగళహారతి, 4వ తేదీ ఉదయం 7.30 గంటలకు లక్ష్మీనరసింహస్వామికి అవభత స్నానం జరుగును. 5వ తేదీ ఉదయం 8 గంటలకు పంచామతాఅభిషేకం, అనంతరం స్వాతి నక్షత్రమున స్వామి వారి కల్యాణ మహోత్సవం, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం నుంచి అన్నదాన ప్రసాదం అందజేస్తారన్నారు. ఈ వేడుకలకు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముఖ్యఅతిథిగా, ఏపీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, సర్పంచు సానే జయచంద్రారెడ్డి హాజరవుతారని తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

In the Court of the Senior Civil Judge: Penukonda

S.O.P.No.3/2019

Between:

Racharla Nandini ...Petitioner

And

1.The Commandant 77 Batalian CRPF Chennai. 2.K.Anjinappa 3.K.Mallakka 4.K.Subramanyam 5.K.Muali ...Respondants

NOTICE

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పై దావాలోని పిటీషనర్ Succission Certificateకు గాను అర్జీ దాఖలు చేసియున్నారు. సదరి దావాలోని ప్రతివాదులందరూ హాజరై ఆక్షేపణలు తెలుపుకొన్నారు. మరియు ఈ దావాకు సంబంధించి మిగతా ఎవరికైన ఆక్షేపణలు ఉన్న యెడల 27-04-2023వ తేదిన ఉ॥ 10.30 గం॥లకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల అట్లు హాజరుకాని యెడల పై దావా మీకు పరోక్షంగా తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:27-04-2023.

పిటీషనర్స్ వకీలు
ఎం.భాస్కర్‌రెడ్డి, ఎం.ఏ., బి.ఎల్
కె.అశ్వర్థనారాయణ, బి.ఏ., ఎల్.ఎల్.బి.
అడ్వకేట్స్, పెనుకొండ, శ్రీసత్యసాయి జిల్లా.